సిబ్బంది లేక ఇబ్బంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల ఖాళీ..

- కొన్ని కేంద్రాల్లో నియామకానికి నోచుకోని టీచర్‌ పోస్టులు
- మూతపడుతున్న కేంద్రాలు..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- అంతంతమాత్రంగానే చిన్నారులకు సేవలు..


పిల్లలకు పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు..

బంజారాహిల్స్‌: పేద, మధ్యతరగతి చిన్నారులు చదువుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేక, కొన్ని సెంటర్లలో టీచర్లు లేక చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏళ్ల తరబడి టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడంపై శ్రద్ధ చూపడం లేదు. షేక్‌పేట సెక్టార్‌ పరిధిలోని ఫిలింనగర్‌లోని పద్మాలయా అంబేద్కర్‌నగర్‌ బస్తీలో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌తో పాటు ఆయా కూడా లేకపోవడంతో మూత పడింది. దీంతో మరో అంగన్‌వాడీ టీచర్‌ ఆహారం తీసుకువచ్చి అప్పుడప్పుడు పంపిణీ చేసి వెళ్లిపోతున్నారు.

- అంబేడ్కర్‌నగర్‌ నాలా అంగన్‌వాడీ కేంద్రంలో సైతం టీచర్‌తో పాటు ఆయా కూడా లేకపోవడంతో సమీపంలోని ఎంజీనగర్‌ అంగన్‌వాడీ టీచర్‌ ఇక్కడ ఆహారాన్ని సరఫరా చేసి వెళ్లిపోతున్నారు.
- ఫిలింనగర్‌లోని గౌతంనగర్‌, ఎంఆర్‌సీకాలనీ, వినాయకనగర్‌, స్వామి వివేకానందనగర్‌ బస్తీల కేంద్రాల్లో ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- టోలిచౌకి ఏరియాలోనూ మూడు కేంద్రాల్లో ఆయాలు లేరు.
- రహమత్‌నగర్‌ సెక్టార్‌ కింద 31 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో ఆరోగ్యనగర్‌, హనుమాన్‌ స్టోన్‌ కట్టర్‌ బస్తీ, సుభాష్‌చంద్రబోస్‌నగర్‌, నవీన్‌నగర్‌, కార్మికనగర్‌–4, శ్రీరాంనగర్‌–3, శ్రీరాంనగర్‌–4, రహమత్‌నగర్‌–1, రహమత్‌నగర్‌–3 కేంద్రాల్లో ఇప్పటికే ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఐసీడీఎస్‌ ఖైరతాబాద్‌ ప్రాజెక్ట్‌–2 పరిధిలో మొత్తం 151 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా దాదాపు 60 కేంద్రాలకు ఆయాలు లేకపోవడంతో టీచర్లే ఆయాల విధులు నిర్వర్తిస్తున్నారు.
- 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చాలా చోట్ల టీచర్‌ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.
- అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు ప్రణాళికలు రూపొందించింది. అయితే టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పోస్టులు భర్తీ చేయాలని గత కొంతకాలంగా స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇంత వరకు అందుకు సంబంధించిన జీఓ విడుదల కాలేదు. ఫలితంగా టీచర్లు, ఆయాలు లేకుండా చాలా కేంద్రాలు మూతపడతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఐసీడీఎస్‌ ఖైరతాబాద్‌ ప్రాజెక్ట్‌–2 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్‌, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గాల పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర సౌకర్యాలతో సామాన్య, మధ్య తరగతికి చెందిన పిల్లలతో పాటు గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువై అంకితభావంతో పనిచేసే సిబ్బంది లేక అంగన్‌వాడీ కేంద్రాలు రోజురోజుకు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. ప్రభుత్వం మాత్రం ఈ కేంద్రాలను బాగు చేస్తున్నట్లు ప్రకటనలు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచడం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్‌ : మోతీలాల్‌నగర్‌, అవంతినగర్‌, జనప్రియ 11కెవీ ఫీడర్లు ఎయిర్‌పోర్ట్‌, మోతీనగర్‌, జనప్రియ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పేస్‌ ఆసుపత్రి, గురుమూర్తి లైన్‌, మోతీలాల్‌నగర్‌, నెహ్రూనగర్‌, ఎయిర్‌ కార్గో, శ్యామలకుంట, బబ్బుగూడ, మోతీనగర్‌, కబీర్‌నగర్‌, అవంతినగర్‌, హనుమాన్‌టెంపుల్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ గురువారం తెలిపారు. మెజిస్టిక్‌ మ్యాన్షన్‌, లక్ష్మీకాంప్లెక్స్‌, ఇంద్రప్రస్థ 11కెవీ ఫీడర్లు ప్రకాశ్‌నగర్‌, ఆల్వీన్‌ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎరుకల బస్తీ, మెజిస్టిక్‌, మ్యాన్షన్‌, జాగృతి అపార్ట్‌మెంట్స్‌, భగత్‌సింగ్‌నగర్‌, ప్రేమ్‌నగర్‌, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఇంద్రప్రస్థ బిల్డింగ్స్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేడు నిమిషాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

రహమత్‌నగర్‌: ఆషాఢ, శ్రావణ మాస శుక్రవారాలను పురస్కరించుకుని బోరబండ సైట్‌ 2లోని నిమిషాంబ దేవి ఆలయంలో శుక్రవారం విశిష్ట అలంకార ఉత్సవాలు, ప్రత్యే క పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారిని వివిధ రూపాల్లో ఆలంకరించి, సాయంత్రం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నిధులు మంజూరు


అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఎన్‌ రెడ్డి

రహమత్‌నగర్‌: రహమత్‌నగర్‌ డివిజన్‌లో అంగనవాడీ కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు జీహెచ్‌ఎంసీ స్టాడింగ్‌ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్‌ సీఎన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈ భరత్‌తో కలిసి పలు బస్తీల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల దుస్థితిపై తాను పలు మార్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌, మేయర్‌ కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందని, దీంతో ప్రతి అంగన్‌వాడి కేంద్రానికి రూ 5 లక్షలు మంజూరయ్యాయన్నారు.జీహెచ్‌ఎంసీ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ వణీధర్‌తో పాటు కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులు వేగవంతం చేస్తాం



వెంగళరావునగర్‌: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేస్తామని స్థానిక కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ అన్నారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌ కాలనీ వెంచర్‌–1లో రోడ్లు, విద్యుత్‌, మంచినీటి సమస్యలపై స్థానికుల నుంచి ఫిర్యాదు అందిన నేపథ్యంలో గురువారం ఆమె జీహెచ్‌ఎంసీ, శానిటేషన్‌, స్ట్రీట్‌లైట్స్‌, ఇంజనీరింగ్‌ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. అనేకచోట్ల రోడ్లు పూర్తిగా పాడైపోయాయని, సకాలంలో మంచినీరు రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ నూతనంగా రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు పంపామని. వీధి దీపాలు, మంచినీరు తదితర సమస్యలను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ విభాగం డీఈ రామచంద్రరాజు, ఏఈ అవినాష్‌, వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ ప్రేమ్‌, కాలనీనేతలు, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు విజయ్‌ కుమార్‌, సత్యశ్రీ, సత్యనారాయణ, షోయబ్‌, అతీఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌లో దళారుల దందా



పంజగుట్ట: ఇటీవల రవాణాశాఖ కార్యాలయాల్లో ఏసీబీ జరుగుతుండటంతో మధ్యవర్తులను కార్యాలయంలోపలికి రానివ్వడంలేదు. దీంతో ఖైరతాబాద్‌ రవాణాశాఖ కార్యాలయం ఎదుట ఉన్న బస్‌స్టాప్‌ను దళారులు అడ్డాగా మార్చుకున్నారు. అక్కడ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఏసీ బస్టాప్‌లు వారికి అడ్డాగా మారాయి. బస్టాప్‌లో బస్సుకోసం వేచి ఉండే వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తూ, ట్రాఫిక్‌ అంతరాయం కలిగినా పట్టకుండా పదుల సంఖ్యలో మధ్యవర్తులు అక్కడే తిష్టవేసి తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. బస్సు కోసం వేచి ఉండేవారు ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై తిరగబడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని వీరికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నార.

సైబర్‌ భద్రతపై అవగాహన అవసరం..


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో సైబర్‌ సెక్యూరిటీ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు సైబర్‌ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎస్‌ఏసీఏ సైబర్‌ సెక్యూరిటీ కన్సార్టియం బోర్డు కార్యదర్శి రాజీవర్‌, సైబర్‌ సెక్యూరిటీ రంగ నిపుణురాలు, భద్రతా పరిశోధకురాలు లలిత ఇంటరాక్టివ్‌ సైబర్‌ సెక్యూరిటీ సదస్సు నిర్వహించారు. డిజిటల్‌ ప్రపంచాన్ని సురక్షితంగా, బాధ్యతాయతంగా నావిగేట్‌ చేయడానికి అవసరమైన జ్ఞానం, ఆచరణాత్మక వ్యూహాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ఈ సెషన్‌ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆన్‌లైన్‌ బెదిరింపులు, వ్యక్తిగత డేటా దుర్వినియోగంపై పెరుగుతున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ రిసోర్స్‌ పర్సన్‌ పాస్‌వర్డ్‌ రక్షణ, ఫిషింగ్‌ స్కామ్‌లు, సైబర్‌ బెదిరింపు, డేటా గోప్యత, సోషల్‌ మీడియా ప్రమాదాలు, సురక్షిత బ్రౌజింగ్‌ అలవాట్లతో సహా కీలక అంశాలపై చర్చించారు. డిజిటల్‌ బాధ్యత ప్రాముఖ్యతను విద్యార్థులు అర్థం చేసుకోవడానికి నిపుణులు నిజ జీవిత ఉదాహరణలు, కేస్‌ స్టడీలను ఉపయోగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్‌ ఆధారిత యుగంలో యువతకు సైబర్‌ అవగాహన ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన డిజిటల్‌ పౌరులుగా మారాలని, ఏదైనా అనుమానాస్పద ఆన్‌లైన్‌ కార్యకలాపాలను వెంటనే నివేదించాలని కోరారు.

9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

లిబర్టీ: మున్సిపల్‌ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న సమ్మె నిర్వహిస్తున్నట్లు మున్సిపల్‌ స్టాఫ్‌ అండ్‌ ఔట్‌సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెను విజయవంతం చేయాలని మున్సిపల్‌ కార్మికులకు ఔట్‌సోర్సింగ్‌, కాంట్రాక్టు ఉద్యోగులను కోరారు. గురువారం మున్సిపల్‌ కార్యాలయంలో జరిగిన పారిశుద్ధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్‌ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని లేబర్‌ హాలిడేస్‌ అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్‌ఓల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఖైరతాబాద్‌ అసెంబ్లీ ఎన్నికల అధికారి, సర్కిల్‌–18 డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్‌: ఓటరు నమోదు, ఎన్నికల సమయంలోనూ బూత్‌ స్థాయి అధికారుల (బీఎల్‌ఓ) పాత్ర కీలకమని ఖైరతాబాద్‌ అసెంబ్లీ ఎన్నికల అధికారి, జూబ్లీహిల్స్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ సమ్మయ్య అన్నారు. ఖైరతాబాద్‌ నియోజకవర్గ పరిధిలో బీఎల్‌ఓలుగా నియమితులైన వారికి బుధవారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్‌ హైస్కూల్‌ ఆడిటోరియంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు బీఎల్‌ఓలుగా పనిచేసిన వారికి సరైన అవగాహన లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించాలంటే శిక్షణ తీసుకున్న జీహెచ్‌ఎంసీ పర్మనెంట్‌ ఉద్యోగులు చాలా అవసరమని తెలిపారు. ఓటరు జాబితా, ఓటు నమోదు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సమగ్ర సమాచారంతో పాటు విషయ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలోని 245 పోలింగ్‌ బూత్‌లకు కొత్త బీఎల్‌ఓలను నియమించినట్లు తెలిపారు. ఇకపై ఓటు నమోదు, జాబితా పరిశీలన వీరే పర్యవేక్షిస్తారన్నారు. మార్పులు–చేర్పులు, తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు తదితర ఫారం–6, 7, 8లపై బీఎల్‌ఓలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి


వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎంసీ జకియా సుల్తానా.

వెంగళరావునగర్‌ : వీధి వ్యాపారులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి సర్కిల్‌–19 ఉప కమిషనర్‌ జకియా సుల్తానా అన్నారు. గురువారం ఆమె వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ కార్యాలయంలో వీధి వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంసీ జకియా సుల్తానా మాట్లాడుతూ సర్కిల్‌ పరిధిలోని ప్రధాన వీధుల్లో సైతం వీధి వ్యాపారుల కారణంగా నిరంతరం పెద్ద ఎత్తున ట్రాఫిక్‌ జాం అవుతుందనే విమర్శలు వస్తున్నాయన్నారు. వ్యాపారులు ట్రాఫిక్‌ లేని వీధులను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్కోసారి తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారాలను చేయాలనుకుంటే వీధుల్లో చివర ఎవరికీ అడ్డులేని విధంగా తమ తోపుడుబండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గుర్తింపుకార్డు లేని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఎస్‌ఐ రాంబాబు, జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్‌ అధికారి ప్రనీద, డీపీఓ వెంకట్‌ కిషన్‌, ఏఎంహెచ్‌ఓ సాల్మన్‌రాజు, వీధి వ్యాపారుల సంఘం నేతలు కె.రామ్‌, శంకర్‌, నర్సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

టీఎక్స్‌ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స

తల్లీ ఇద్దరు శిశువుల ప్రాణాలను కాపాడిన వైద్యులు..


వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు..

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లోని టీఎక్స్‌ హాస్పిటల్స్‌లో వైద్యులు అరుదైన, ప్రాణాంతక గర్భధారణ సమస్యను విజయవంతంగా పరిష్కరించి తల్లి, ఇద్దరు శిశువుల ప్రాణాలను కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. జహీరాబాద్‌కు చెందిన ఆయేషా సిద్దికా (29) 28 వారాల గర్భంతో డీసీడీఏ ట్విన్‌ బిడ్డలతో తరచూ రక్తస్రావంతో బాధపడుతూ టీఎక్స్‌ హాస్పిటల్‌కు వచ్చారు. గతంలో ఆమెకు రెండు సిజేరియన్‌ డెలివరీలు, గర్భాశయంపై సర్జరీ జరగడంతో పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారింది. దీంతో రక్తస్రావాన్ని నియంత్రించేందుకు సీనియర్‌ కన్సల్టెంట్‌–వాస్క్యులర్‌ సర్జన్‌) డాక్టర్‌ అవినాష్‌దాల్‌ క్యాథ్‌ల్యాబ్‌లో రెండు కామన్‌ ఇలియాక్‌ ఆర్టరీల్లో బెలూన్‌ క్యాథెటర్లు వేశారు. ఆపై డాక్టర్‌ శృతి పలకొళ్ల, డాక్టర్‌ సుధ శస్త్ర చికిత్స ప్రారంభించారు. రియల్‌టైమ్‌ అల్ట్రాసౌండ్‌ సహాయంతో ఆపరేషన్‌ చేసి ఇద్దరు శిశువులను బయటికి తీశారు. శస్త్ర చికిత్సలో చైర్మన్‌ డాక్టర్‌ కీర్తికారెడ్డి, మేనేజింగ్‌ డైరెక్టర్‌ దీపక్‌రాజు, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ రవీంద్రరెడ్డి, చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ శ్రీకాంత్‌ వొడ్నాల, యూనిట్‌ హెడ్‌ నవ్యలతో పాటు వైద్యుల బృందం కీలకంగా వ్యవహరించింది.

వైద్యులు మౌనం వీడాలి

డాక్టర్ల కోసం డాక్టర్లు రూపొందించిన వీడియో బూట్‌క్యాంప్‌ ఆవిష్కరణ..

బంజారాహిల్స్‌: అసలైన డాక్టర్లు మాట్లాడకపోతే ఆన్‌లైన్‌లో క్వాక్స్‌ (నకిలీ వైద్యుల) అర్ధ సత్యాలతో భయపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తారని, అందుకే సైన్స్‌ ఆధారంగా డాక్టర్లు మాట్లాడాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్త, డిజిటల్‌ నాయకురాలు డాక్టర్‌ మణి పవిత్ర అన్నారు. క్లినిక్‌ నుంచి కెమెరా వరకు డాక్టర్ల కోసం డాక్టర్‌ రూపొందించిన వీడియో బూట్‌ క్యాంప్‌ను బుధవారం జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌–36లోని తన కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. డాక్టర్ల కోసం డాక్టర్‌ రూపొందించిన వీడియో బూట్‌ క్యాంప్‌ ప్రచారం కోసం కాదని, సేవ కోసమే అన్నారు. ఈ రోజుల్లో ఆరోగ్య సమాచారం కోసం రీల్స్‌, స్టోరీస్‌, యూట్యూబ్‌ వీడియోలను ఆశ్రయిస్తున్నారని, అలాంటప్పుడు నమ్మకమైన డాక్టర్లు ఈ సంభాషణ నుంచి ఎందుకు దూరంగా ఉంటున్నారన్నారు. ఇది డాక్టర్లను కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో మాట్లాడేలా తమ కథనాలు, అనుభవం, కరుణతో ప్రజలతో జతకట్టేలా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ బూట్‌ క్యాంప్‌లో దేశం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన 20 మంది డాక్టర్లు పాల్గొన్నారు. పేషెంట్లు డాక్టర్లను సంప్రదించేకంటే ముందే గూగుల్‌ చూస్తున్నారని, ఈ రోజుల్లో ఆన్‌లైన్‌ క్రెడిబులిటీ చాలా ముఖ్యమన్నారు. ఇండియన్‌ కంటెంట్‌ తయారీకి ఇది గొప్ప అవకాశమని, మన డాక్టర్ల అనుభవాన్ని ప్రజలకు మన భాషలో అందించాలన్నారు.

ట్యాంక్‌ బండ్‌పై ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్‌: ట్యాంక్‌ బండ్‌పై ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి(టీవైపీఎస్‌) రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏకలవ్య జయంతిని పురస్కరించుకుని గురువారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్‌తో కలసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది ఎరుకల జనాభా కలిగి ఉన్నామన్నారు. ప్రపంచంలో ఒక చరిత్ర గల వ్యక్తి ఏకలవ్యుడన్నారు. ఏకలవ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏకలవ్య విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏకలవ్య జయంతి ఉత్సవాలకు ప్రతి జిల్లాకు రూ.లక్ష బడ్జెట్‌ కేటాయించాలని కోరారు. ఏకలవ్య అవార్డులను ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉండాడి అంజయ్య, మానుపాటి శ్రీనివాస్‌, సంపత్‌, రేవెల్లి తిరుపతి, ఉండాడి వెంకటేష్‌, నడిగడ్డ కుమారస్వామి, లోకిని పోచయ్య, ఎల్లయ్య, సార్ల తిరుపతి, మొగిలి శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సభకు భారీగా జన సమీకరణ


మాట్లాడుతున్న మురళిగౌడ్‌..

రహమత్‌నగర్‌ : ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరుగనున్న కాంగ్రెస్‌ సభకు జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తరలించనున్నట్లు మాజీ కార్పొ రేటర్‌ గుర్రం మురళీగౌడ్‌ అన్నారు. గురువారం శ్రీరాంనగర్‌ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొనే ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి పొన్నం ప్రభాక ర్‌, జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు,ఎంపీ అనిల్‌కుమార్‌, నగర మేయర్‌ ఆదేశా ల మేరకు నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల నుండి బూత్‌ ఇన్‌చార్జ్‌లు, నాయకులు పెద్ద ఎత్తున తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్‌, యండిగోస్‌, చంద్రమౌళి, అబ్దుల్‌ ఖాదర్‌, ముత్యాల యాదగి రి, కొండపల్లి రమేష్‌ పాల్గొన్నారు.

వైభవంగా శాకంబరి ఉత్సవాలు..


పూజలు నిర్వహిస్తున్న పెద్దమ్మ ఆలయ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి...

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ పెద్దమ్మ దేవాలయంలో కొనసాగుతున్న శాకంబరి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం అమ్మవారి సన్నిధిలో సామూహిక శ్రీలలిత సహస్రనామ కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి ఆలయ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించగా ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి గర్భగుడి దాకా కూరగాయల హారాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు స్కూల్‌ బ్యాగుల పంపిణీ



ఫిలింనగర్‌: విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని టీపీసీసీ కార్యదర్శి, పీజేఆర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకురాలు పి.విజయారెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్‌ స్కూల్‌లో విద్యార్థులకు ఆమె పీజేఆర్‌ ఫౌండేషన్‌ ద్వారా స్కూల్‌ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఏం కావాలన్నా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్‌ హెచ్‌ఎం జీవన్‌ ప్రకాశ్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నేత మోహన్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్బీటీ నగర్‌లో మెగా హెల్త్‌ క్యాంప్‌



బంజారాహిల్స్‌: బస్తీల్లో పెరుగుతున్న జ్వర పీడితులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు అర్బన్‌ హెల్త్‌ సెంటర్ల ఆధ్వర్యంలో బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం బంజారాహిల్స్‌ రోడ్‌ నెం.12లోని ఎన్బీటీనగర్‌ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్బీటీ నగర్‌తో పాటు ఎన్బీనగర్‌, బంజారాహిల్స్‌ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ వైద్యులు, వైద్య సిబ్బంది ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన వారికి 20 రకాల రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను అందించినట్లు తెలిపారు.

రోడ్డు మధ్యలో ఆగిన లారీ

స్తంభించిన ట్రాఫిక్‌



బంజారాహిల్స్‌: లోడ్‌తో ఉన్న బొగ్గు లారీ టైర్‌ ఊడిపోయి రోడ్డు మధ్యలో ఆగిపోవడంతో ట్రాఫిక్‌ స్తంభించిపోయింది. గురువారం తెల్లవారుజామున ఓ లారీ జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్టు వైపు నుంచి మాదాపూర్‌ వైపు వెళ్తుండగా పెద్దమ్మగుడి మెట్రో స్టేషన్‌ దాటగానే టైర్‌ ఊడిపోయి రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్‌ ట్రాఫిక్‌ సీఐ నర్సింగ్‌రావు అక్కడికి చేరుకొని టోయింగ్‌ వాహనంతో లారీని పక్కకు తప్పించారు. లారీలో ఉన్న బొగ్గును వేరే లారీ ద్వారా తరలించారు.

19న బనకచర్లకు వ్యతిరేకంగా ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న నరాల సత్యనారాయణ

హిమాయత్‌నగర్‌ : తెలంగాణకు నష్టం కలిగించే బనకచర్ల ప్రాజెక్టుపై వ్యతిరేకంగా ఈనెల 19న ఇందిరాపార్క్‌ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్‌(టీఆర్‌ఎస్‌–డి) వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలిపారు. గురువారం బషీర్‌ బాగ్‌దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం 200 టీఎంసీలు గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌ మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించేందుకు గోదావరి–బనకచర్ల లింక ప్రాజెక్టును సుమారు రూ.80వేల కోట్లతో చేపడుతుందని ఆరోపించారు. త్వరలో జరుగబోయే జూబ్లీహిల్స్‌ ఎన్నికకు టీఆర్‌ఎస్‌–డీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, కంచర్ల మంజూషను ప్రకటించారు. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు త్వరలోనే పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు శంకర్‌ గౌడ్‌, రాజు, శ్యామల, శివప్రసాద్‌ స్వరూప, నాగభూషణం, రేఖ, శారద, శ్రీలత, లక్ష్మీ, సరిత, సైదమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

వెంగళరావునగర్‌: వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలు మాయమైన సంఘటన మధురానగర్‌ పీస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎల్లారెడ్డిగూడకు చెందిన సాయికృష్ణ గతనెల 19న రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్క్‌ చేసి స్వగ్రామానికి వెళ్లాడు. ఈనెల 2న ఇంటికి వచ్చి చూడగా బైక్‌ కనిపించలేదు. అదేవిధంగా బోరబండకు చెందిన వి.దుర్గాప్రసాద్‌ ఈనెల 2న ఎల్లారెడ్డిగూడలోని ఓ ఇంట్లో విద్యుత్‌కు చెందిన పనులు చేసేందుకు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఆ ఇంటి ముందు పార్క్‌ చేశాడు. సాయంత్రం తిరిగి వెళ్ళడానికి రోడ్డుమీదకు రాగా తన వాహనం కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు మధురానగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.